# క్యూఆర్ కోడ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**సిపి అనురాధ**

**సిద్దిపేట, (ప్రభాతవార్త) ప్రతినిధి:** తెలంగాణ పోలీసు సేవలపై ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తయారుచేసిన క్యూఆర్ కోడ్‌ను గురువారం సీపీ డాక్టర్ అనురాధ సీపీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుల తీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించడానికి క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ పోస్టర్లు ప్రతి పోలీసు స్టేషన్‌లో, సర్కిల్, ఏసిపి కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు, ఫిర్యాదులు, పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈ చాలన్ ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్ట్ ధ్రువీకరణ తదితర అంశాలపై ఫీడ్ బ్యాక్ తెలియజేయాలన్నారు. ప్రజలకు మరిన్ని ఉన్నత సేవలు అందించడానికి క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదుదారుల ఫీడ్‌బ్యాక్ సేకరణ చేయడం జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారులు పోలీసుస్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇచ్చినప్పుడు అందుతున్న సేవలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఫీడ్ బ్యాక్ ఇచ్చే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# మంత్రి పొన్నంను కలిసిన గౌడ సంఘం నేతలు

**వర్గల్, జనవరి 16 (ప్రభాతవార్త):** రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూం కుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గౌరారం గ్రామ గౌడ సంఘంనాయకులు కరీంనగర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వర్గల్ మాజీఎంపిపి మోహన్, నాయకులు పల్లె బాల్‌నర్సయ్యగౌడ్, తాళ్ల భానుప్రసాద్ గౌడ్, గుండు నర్సింలుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో గౌడ సంఘం నేతలు



## సర్వేను పరిశీలించిన జిల్లా ప్రత్యేక అధికారి హరిచందన

**కంది, జనవరి 16, ప్రభాతవార్త:** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు(రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు) అమలుకు గురువారం మండలపరిధిలోని చిమ్నాపూర్‌తో పాటు జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని బృందావన్ కాలనీలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరి చందన, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో అధికారులు ప్రత్యేకంగా చర్చించి ప్రభుత్వ పథకాలు అమలుపై ఆరా తీశారు.

## క్షేత్రస్థాయిలో సర్వేను సజావుగా నిర్వహించాలి

**-మెదక్ ఆర్డీవో రమాదేవి**



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 16 ప్రభాతవార్త:** క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. గురువారం మెదక్ పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక కసరత్తును ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో జరుగుతోన్న సర్వే సరళిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలను గుర్తించాలని, భూములు, ఆదాయం, వంటి వివరాలను తప్పులు లేకుండా ఫార్మ్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సర్వేలో భాగంగా వివరాలలో తేలిన వివరాల ఆధారంగా అర్హుల జాబితాను రూపొందించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాహశీల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ఐ లక్ష్మణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతరలో ట్రాఫిక్ సమస్య నెలకొనకుండా చర్యలు చేపట్టాలి : ఏసిపి పురుషోత్తంరెడ్డి



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసిపి పురుషోత్తంరెడ్డి

**జగదేవ్‌పూర్, జనవరి 16 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ సమీపంలో వెలసిన శ్రీకొండపోచమ్మ అమ్మవారి జాతర త్వరలో ప్రారంభం కానున్నందున గురువారం గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డి రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్‌తో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని, అదేవిధంగా వ్యాపారస్తులు రోడ్లపై సామాగ్రిని పెట్టవద్దని, అక్కడక్కడ బ్యారికేడ్లను ఏర్పాటుచేసి జాతరలో ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. అమ్మవారి ప్రతిష్టతకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం

## వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హరికిరణ్

**సిద్దిపేట అర్బన్, జనవరి 16, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిద్దిపేట పట్టణానికి చెందిన ఆర్వపల్లి హరికిరణ్‌ను నియమిస్తూ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తణుకు ఆంజనేయులు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మంకాల నాగేష్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం సిద్దిపేట పట్టణంలోని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్ చేతుల మీదుగా హరికిరణ్‌కు నియామకం పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగాన్ని మరింత పటిష్టం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు మంకాల నవీన్‌కుమార్, గంప కృష్ణమూర్తి, పొశెట్టి శ్రీనివాస్, కాసనగొట్టు శ్రవణ్‌కుమార్, పుల్లూరు శశాంక్, మంకాల సంతోష్‌కుమార్, కొండూరి సతీష్, పొకల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నియామకం పత్రాన్ని అందుకుంటున్న హరికిరణ్

# భూసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**అధికారులతో ట్రైనీ కలెక్టర్ మనోజ్**

**ఝరాసంగం, జనవరి 16, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుట్టనున్న 4 పథకాలకు సంబంధించి మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు ఈదుపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను గురువారం ట్రైనీ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు. రైతు భరోసాలో భాగంగా సాగుకు యోగ్యం కాని భూములు, వెంచర్లు చేసిన భూముల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ గ్రామాల్లో లే అవుట్ వేసిన భూములు, వెంచర్ భూములు, ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలను సర్వే ద్వార తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులకు అర్హులైన వారిని గుర్తించేందుకే సర్వేను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవిన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ తిరుమలరావు, మండల అభివృద్ధి అధికారి సుధాకర్, మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, సర్వేయర్ నర్సింలు, ఏఎస్ఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఝరాసంగంలో భూ సర్వేను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

# కక్షపూరితంగానే మాజీమంత్రి కెటిఆర్‌పై కేసు నమోదు

**ఎమ్మెల్యే సునీతారెడ్డి**

**నర్సాపూర్, జనవరి 16, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం కెటిఆర్‌పై కక్షపూరితంగానే కేసు నమోదు చేసిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, 6 గ్యారంటీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కెటిఆర్ నిలదీయడంతో కక్ష గట్టి అక్రమంగా కేసులు బనాయించారని అన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఫార్ములా ఈ కార్ రేస్ తెలంగాణకు తీసుకురావడానికి కేటీఆర్ ప్రయత్నించారని, హైదరాబాద్ ఇమేజ్ పెంచడానికి కృషి చేశారని ఆమె చెప్పారు. కానీ రాజకీయ కక్షపూరితంగానే ఆయనపై ప్రభుత్వం ఫార్ములా ఈ కార్ రేస్ కేసు నమోదుచేసిందని ఆరోపించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఫార్ములా ఈ-కార్ రేస్ రాష్ట్రానికి తీసుకురావడానికి కేటీఆర్ కృషి ఎంతగానో ఉందన్నారు. దీంతో ప్రపంచంలోని వివిధ దేశాలు తెలంగాణలోని హైదరాబాదులో పెట్టుబడులు పెట్టి కంపెనీలు పెట్టడానికి వస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని దివాలా తీసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 6 గ్యారంటీలను ప్రజలు అడగకుండా తప్పుదోవ పట్టించడానికి కేటీఆర్‌పై అక్రమ కేసు బనాయించారని అన్నారు. ఇందులో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతి లేదని అధికారులు స్పష్టం చేసినందున ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఎమ్మెల్యే సునీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, టిఆర్ఎస్, మాజీ జెడ్పిటిసి బాబ్యానాయక్, నాయకులు సత్యం గౌడ్, మాజీ సర్పంచ్ ఉమ్లా నాయక్, జీవన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు పంబల్ల బిక్షపతి, కౌన్సిలర్ పంబల్ల రామచందర్ నాయ కులు సంతోష్‌రెడ్డి, రింగుల ప్రసాద్, జగదీశ్వర్, గుంజరి ప్రవీణ్, ఆంజనేయులుగౌడ్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

## అర్హులకు రేషన్‌కార్డులు,ఇందిరమ్మ ఇళ్లు అందాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న**

**హుస్నాబాద్ రూరల్, జనవరి 16, ప్రభాతవార్త :** పట్టణంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులతోపాటు ఇందిరమ్మ ఇండ్లు అందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21 నుండి 24వ తేదీ వరకు కౌన్సిలర్లు, అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వార్డుసభలు నిర్వహించాలని ఈ సభలోనే ఇందిరమ్మ ఇండ్లతోపాటు నూతన రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారితో పాటు చేసుకోనివారి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి,కమిషనర్ మల్లిఖార్జున్ గౌడ్, కౌన్సిలర్లు కొంకటి నళినిరవి, బోజు రమాదేవి రవీందర్, స్వర్ణలత, పెరుక భాగ్యరెడ్డి, పద్మ, గోవిందరవి, దొడ్డి శ్రీనివాస్, సరోజన, రత్నమాల, రాజు, హరీష్, వాల సుప్రజనవీన్‌రావు, కోఆప్షన్ సభ్యులు అయూబ్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న



రాంచంద్రపూర్‌లో రైతుభరోసా సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

## రైతు భరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**ఆర్డీవో మహిపాల్‌రెడ్డి**

**నర్సాపూర్, జనవరి 16, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ మండలం రాంచంద్రపూర్ గ్రామంలో గ్రామసభను నిర్వహించి అధికారులు రైతు భరోసా సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సాగుకు యోగ్యమైన రైతుల భూములకు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అధికారులు రైతుభరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించి అర్హులైన రైతులను గుర్తించాలని ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్. మండల వ్యవసాయ అధికారి దీపిక, ఆర్ఐ సిద్ధిరాం రెడ్డి, ఏఈఓలు, రెవెన్యూ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నాం

**26వ తేదీ నుండి ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, రైతు బరోసా పథకాల అమలు**

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి**

**కొల్చారం, జనవరి 16 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని, ఈ నెల 26వ తేదీ నుండి ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాలు అమలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి తెలిపారు. గురువారం కొల్చారం మండలం రంగంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలుచేస్తుందని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఫ్రీ కరెంట్, ఆరోగ్యశ్రీ సాయం రూ. 10 లక్షలకు పెంపు, రైతులకు రుణమాఫీ చేశామన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా పంట పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రభుత్వం అమలు చేయనుందని, ఈ నెల 26న సాగుకు అనుకూల భూములకు మాత్రమే పెట్టుబడి సహాయం ఎకరానికి రూ.12 వేలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాగే పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత రేషన్ కార్డులు జారీ కానున్నాయని, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు పాత రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులు కూడా చేయనున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని సైతం తెలంగాణ ప్రభుత్వం అందజేయనుందని, ఇది జనవరి 26వ తేదీను నుంచి అమలు చేయనుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక కోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయింది. ఇళ్ల లబ్దిదారులకు పలు విడతల్లో రూ.5 లక్షలను ఇవ్వనున్నామని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి ఒక్కొక్కటిగా 6 గ్యారంటీలను అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కొల్చారం మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చందు, క్రిష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు గౌడ్



నూతన అధ్యక్షులను శాలువాలతో సత్కరించిన ఎంపి రఘునందన్‌రావు

### స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా

## నూతన అధ్యక్షులు పనిచేయాలి

**-మెదక్ ఎంపి రఘునందన్‌రావు**

**గజ్వేల్, జనవరి 16 (ప్రభాతవార్త):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా నూతన అధ్యక్షులు పనిచేయాలని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఇటీవల గజ్వేల్ నియోజకవర్గ, పట్టణ, మండలాల నూతన అధ్యక్షులను ప్రకటించగా గురువారం నూతన అధ్యక్షులు ఎంపి రఘు నందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి రఘు నందన్‌రావు నూతన అధ్యక్షులను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, కుకునూర్‌పల్లి మండల అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి, కొండపాక మండల అధ్యక్షుడు నీల సత్యం, తూప్రాన్ పట్టణ అధ్యక్షుడు జానకిరామ్‌గౌడ్, మనోహరాబాద్ మండల అధ్యక్షుడు బక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతిమ యుద్ధానికి మాదిగలు సిద్ధం కావాలి

**-ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి**



దామరకుంటలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

**మర్కుక్, జనవరి 16 (ప్రభాతవార్త):** మాదిగల చిరకాల ఆకాంక్ష ఎబిసిడి వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే విషయంలో జాప్యం జరపడం బాధాకరమని, మాదిగలంతా అంతిమ యుద్ధానికి సిద్ధం కావాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు మైస రాములు అన్నారు. మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో మాదిగ జేఏసి మండల కన్వీనర్ మొండి బిక్షపతి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం దామరకుంటలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాల మద్దతు కూడగట్టుకొని 30 సంవత్సరాల ప్రస్తానాన్ని, 30 రోజుల్లో కార్యాచరణ నిర్మించి మాదిగలు ఇంటికో డప్పు, ఊరుకో బస్సు కట్టుకొని సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7న హైద్రాబాద్‌లో జరగబోయే లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన బాధ్యతగా ప్రతి మాదిగ జబ్బకు డప్పుతో బయలెల్లి హైదరాబాద్ నగరంలో డప్పుల మోత మోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల జేఏసి కో-కన్వీనర్ కర్రోళ్ల నర్సింలు, మండల మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ కో-కన్వీనర్ జాలని యాదగిరి, కో-ఆర్డినేటర్ చిన్నికృష్ణ, ఎమ్మార్పీఎస్ బాధ్యులు ఉబ్బని ఆంజనేయులు, శనిగరి రమేష్, బొమ్మని మహేష్, మొండి రమేష్, నరేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐగా పదోన్నతి పొందిన ఎఎస్ఐ దుర్గారెడ్డి





టూస్టార్ బ్యాడ్జి అతికిస్తున్న జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

**సంగారెడ్డి మున్సిపాలిటీ జనవరి 16, ప్రభాతవార్త :** ఉమ్మడి మెదక్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఎస్ దుర్గారెడ్డి ఎస్ఐగా ప్రమోషన్ పొందారు. ఏఎస్ఐగా ఉన్న ఆయన ఎస్ఐగా శిక్షణ పూర్తి చేసుకొని పదోన్నతి పొందారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ చెన్నూరి రూపేష్, ఎస్ఐగా పతనతి పొందిన దుర్గా రెడ్డికి టూస్టార్ బ్యాడ్జి అతికించారు.

## ఆర్డీవోను కలిసిన పిఆర్‌టియు టిఎస్ నాయకులు

**నర్సాపూర్, జనవరి 16, ప్రభాతవార్త :** పట్టణంలో గురువారం పిఆర్‌టియుటిఎస్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఆర్డీవో మహిపాల్ రెడ్డిని, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో మధులతలను నాయకులు మర్యాదపూర్వకంగా డైరీ, క్యాలెండర్ అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ ఇంత వరకు ఇవ్వలేదని, వెంటనే ఇప్పించాలని కోరడం జరిగింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో చర్చించడం జరిగిందని పేర్కొంటూ రెండు మూడు రోజులలో మీ అకౌంట్లో అమోంట్ క్రెడిట్ అవుతాయని చెప్పడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్, నర్సాపూర్ మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, కౌడిపల్లి మండల అధ్యక్షులు రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వీరేశం, ప్రసన్నకుమార్, జిల్లా మహిళా ప్రతినిధి శ్రీ జ్యోతి, వెల్దుర్తి మండల అసోసియేట్ అధ్యక్షులు చందర్, నర్సాపూర్ మండల శాఖ సభ్యులు ఇంతియాజ్, భీమ్లా, రవికుమార్, సత్యనారాయణ,నవాజ్, రామన్న మొదలైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్డీవో మహిపాల్‌రెడ్డిని కలిసిన పిఆర్‌టియు టిఎస్ నాయకులు తదితరులు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

### మల్లన్న దేవాలయ 33 రోజుల హుండీ
## ఆదాయం రూ.73,14, 488 నగదు

**కొముురవెల్లి, జనవరి 16,ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం 33 రోజుల హుండీని గురువారం లెక్కించారు. 33 రోజుల ఆలయ హుండీ లెక్కింపులో రూ.73,14,488 నగదు, 134 గ్రాముల మిశ్రమ బంగారం, 009 కిలోల 300 గ్రాముల మిశ్రమ వెండి, విదేశీ కరెన్సీ 26, మిశ్రమ బియ్యం 10 క్వింటాళ్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో శివరామకృష్ణ భజన మండలి సేవ సమితి సభ్యులు, ఈవో రామాంజనేయులు, ఆధికారులు చంద్రశేఖర్, బుద్ధి శ్రీనివాస్, శ్రీరాములు, సురేందర్, ధర్మకర్తలు జయప్రకాష్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, వల్లాద్రి అంజిరెడ్డి, మామిడాల లక్ష్మీ, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, టిజిబి బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న వడ్లూరి పర్శరాం

**బెజ్జంకి, జనవరి 16, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో ఈనెల 19న నిర్వహించ తలపెట్టిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సభకు మండలం నుంచి మాదిగ, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వడ్లూరి పర్శరాం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువాం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సన్నహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు రెండు జిల్లాల పర్యటనలో భాగంగా ఈనెల 19న సిద్దిపేట జిల్లాకు విచ్చేస్తున్న మంద కృష్ణమాదిగకు ఘనస్వాగతం పలకాలన్నారు. ఫిబ్రవరి 7న హైదారాబాద్‌లో జరిగే వేయి గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శన ర్యాలీ సభకు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, కర్రావుల మల్లేశం, మంకాల బాలయ్య, కొంకటి జగన్, చింతకింది పర్శరాములు, తాడిచెట్టు భూమయ్య, మోదుంపల్లి రాజు, చింతకింది ఎల్లయ్య, బెజ్జంకి శంకర్, బోనగిరి చంద్రం, దక్కలి సంఘం నాయకులు లచ్చయ్య పాల్గొన్నారు.

### సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


సిఎంరేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, జనవరి 16, ప్రభాతవార్త :** పేదల కోసం రేషన్‌కార్డుల ప్రక్రియ జారీకి రేవంత్‌రెడ్డి సర్కారు శ్రీకారం చుట్టడంతో గురువారం సిద్దిపేటలోని 37వ వార్డు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రేషన్ కార్డులు లేని ఎంతో మంది పేదలు దరఖాస్తులు చేసుకున్నా ఫలితం దక్కలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు ప్రతి పేద కుటుంబానికి రేషన్‌కార్డులు అందించడానికి శ్రీకారం చుట్టిందన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చుకుంటు ముందుకు సాగుతుందన్నారు. పేదలకు రేషన్‌కార్డులు అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినందులకు సిఎం రేవంత్‌రెడ్డి, సంబంధితశాఖ మంత్రి ఉత్తమ్‌కుర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహమ్మద్ రియాజుద్దీన్, పార్టీ నాయకులు దాసరి నర్సింలు, సాకి శ్రీనివాస్, మల్లేశం, సాకి రఘు, బయ్యారం యాదగిరి, సాకి అశోక్, ఎనుగుల నటరాజ్, తండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ నిరుపయోగ భూముల గుర్తింపు


వివరాలను సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

**సిద్దిపేట అర్బన్, జనవరి 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లిలో గురువారం జిల్లా కలెక్టరేట్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు పర్యటించింది. గ్రామంలో వ్యవసాయ సాగుకు అనువుగా లేని భూములను, నిరుపయోగ భూముల వివరాలను క్షేత్రస్థాయిలో గుర్తించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడిఎ పద్మ, మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనాథ్, విస్తరణ అధికారి నవనీత, ఆర్ఐ నర్సింలు, పంచాయతీ కార్యదర్శి నరసింగరావు పాల్గొన్నారు.

### కుమ్మరి శాలివాహన సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**రాయపోల్, జనవరి 16 ప్రభాతవార్త :** కుమ్మరి శాలివాహన సంఘం క్యాలెండర్‌ను ఎస్ఐ రఘుపతి గురువారం కుల సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆనంతరం కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు బొందుగుల షాదుల్ల మాట్లాడుతూ.. కుమ్మరి సంఘం సభ్యులు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం ఆవుతాయన్నారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా నాయకులు కుమ్మరి యాదగిరి, యూత్ మండల అధ్యక్షుడు హనుమాన్ రాజు, ప్రధానకార్యదర్శి రామారం స్వామి,కోశాధికారి అనాజిపూర్ కుమార్, యూత్ ఉపాధ్యక్షులు ఆనాజిపూర్ నాగరాజు, గౌరవ అధ్యక్షులు కుమ్మరి లింగం,మండల కార్యవర్గ సభ్యులు రాయపోల్ కనకరాజు, రామారం నర్సింలు, నాగరాజు, కనకయ్య, దుర్గయ్య, కుమ్మరి స్వామి పాల్గొన్నారు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

# నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం

**వర్గల్, జనవరి 16(ప్రభాతవార్త):** మండల పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి గానూ నిర్వహించే ఎంపిక పరీక్ష కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. వర్గల్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో మొత్తం 80సీట్లకుగానూ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 6465 మంది విద్యార్థులు పోటీపడుతున్నారని తెలిపారు. ఈనెల 18వ తేదీ శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒకటిన్నర గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 2250 మంది విద్యార్థులు, మెదక్ జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలలో 1589, సంగారెడ్డి జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలలో 2626 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు నవోదయ వెబ్‌సైట్ ద్వారా అన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఈనెల 8వ తేదీన నవోదయ ప్రవేశ ఎంపిక పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించే 30 మంది పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులు, 30 మంది కేంద్ర పరిశీలకులు, ఇతర అధికారులకు మూడు జిల్లాల ప్రధాన కేంద్రాలలో శిక్షణ ఇవ్వబడిందన్నారు. ప్రవేశ ఎంపిక పరీక్ష 2025 పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి తప్పనిసరిగా హాల్ టికెట్‌తో హాజరు కావాలని సూచించారు. నవోదయ ప్రవేశ ఎంపిక పరీక్ష ఏర్పాట్లలో సహకరించిన మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లకు, ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలిపారు.

## పిహెచ్‌సి భవనాలకు మరమ్మతులు

### పనులను పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

**నవాబుపేట జనవరి 16, ప్రభాతవార్త :** మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన మరమ్మతు పనులను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌ను, ఇన్‌పేషెంట్ వార్డును, లేబర్ గదిని పరిశీలించారు. అనంతరం వట్టిమీనపల్లిలో నిర్వహి స్తున్న లబ్దిదారుల గుర్తింపు సర్వేను, పులుమామిడి రెవె న్యూ పరిధిలో నిర్వహిస్తున్న రైతు భరోసా సర్వేను, అంగ న్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పాత భవనాలను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించేందుకు నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. ప్రసవాలు స్థానిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించేందుకు ప్రత్యేకంగా కృషిచేయాలని డాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా కుటుంబ నియంత్రణ శత్ర చికిత్సలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకో వాలని అన్నారు. మీనపల్లికలాన్‌కు చెందిన రైతు భాస్కర్ కలెక్టర్‌ను కలిసి రుణ మాఫీ చేయించాలని వినతి పత్రం ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి వెంకటర మణ, తహశీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, మండల వైద్యాధికారి రోహిత్, పంచాయతీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.

## ప్రపంచ యవనికపై మహేశ్వరం

### మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

**మహేశ్వరం, జనవరి 16 ప్రభాతవార్త :** మహేశ్వరం నియో జకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లలతో మా ట్లాడుతూ ఫోర్త్ సిటీ ఏర్పాటు కానున్న స్కిల్ యూనివర్సిటీ సహా పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ఇవాళ్టి నుంచి ఈ నెల 23వ వరకు సీఎం రేవంత్‌రెడ్డి బృందం సింగ పూర్, దావోస్(స్విట్జర్లాండ్) పర్యటన కొనసాగుతుందని చెప్పా రు. దేశ ప్రయోజనాలు, సమైక్యత, సమానత్వం పెం పొందేలా ఏఐసీసీ కార్యాలయం ఢిల్లీలో నిర్మించడం హర్షిం చదగ్గ విషయమన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ విషయంలో ఈ ఫార్ములా కేసు చట్ట పరిధిలో విచారణ జరుగుతుం దన్నా రు. ఇందులో కాంగ్రెస్ జోక్యం చేసుకోబోదని స్పష్టం చేశారు. ఇప్పటికే హైకోర్టు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన విష యాన్ని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు గుర్తించాలని సూచిం చా రు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి కంటే అవినీతి ఎక్కువ జరిగిందని మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గం లో రోడ్లు, అభివృద్ధి, ఫోర్త్ సిటీ నిర్మాణానికి కావాల్సిన నిధు లను పార్టీలు, విపక్ష నాయకులపై వివక్షత చూపకుండా సీఎం రేవంత్‌రెడ్డి కేటాయిస్తున్నారని స్పష్ట చేశారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**యాచారం, జనవరి 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి గ్రామానికి చెందిన పగడాల బుగ్గయ్య అనారోగ్యం కారణంగా గురువారం మృతి చెందాడు. మాజీ ఎంపీటీసీ కొర్ర జ్యోతి అరవింద్ నాయక్, మంతన్ గౌరెల్లి కాంగ్రెస్ పార్టీగ్రామ శాఖ అధ్యక్షులు కదారి యాదయ్య లతో కలిసి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి మాజీ ఎంపిటిసి జ్యోతి అరవింద్ నాయక్ 5000/ రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు తారసింగ్ పూజ,రమేష్, నక్క సత్య,నందు,లింగ, పటాన్ అఖిల్ ఖాన్ బీసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో పట్టుదల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది : ఎమ్మెల్సీ

**కేశంపేట జనవరి 16 ప్రభాతవార్త:** నేటి సమాజంలో యువత తమకు ఇష్టమైన క్రీడా రంగాలలో రాణించాలని విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు బంగారంలా ఉంటుందని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లీగ్ 2 ఫైనల్ మ్యాచ్ కి ముఖ్య అతిధిగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తో కలిసి హాజరై గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు ఈ సందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల క్రీడాకారులకు మానసిక ఉల్లాసంతో పాటు, శారీరిక శ్రమపెరిగి ఆరోగ్యంగా ఉంటారని, క్రీడల్లో పాల్గొనడం ద్వారా పోటీ తత్వం పెరిగి కసి పట్టుదలతో ముందుకు వెళ్తారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న యువత కష్టపడి గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర, జాతీయ రాష్ట్రస్థాయి వరకు ఎదగడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా క్రీడల వైపు మగ్గుచూపితే భవిష్యత్తు అంతా బంగారంలా ఉంటుందని ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో కేశంపేట మాజీ జడ్పిటిసి నర్సింగ్ రావు, తొమ్మిది రేకుల మాజీ సర్పంచ్ సావిత్రి బాల్ రాజు గౌడ్ , మాజీ ఎంపిటిసిలు యాదయ్య, కోటేశ్వర్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు,భూపాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డి, నాయకులు శేఖర్ పంతులు నాగిళ్ల వెంకట్, పురుషోత్తం గౌడ్, శేఖర్ గౌడ్, ప్రేమ్ గౌడ్, కిశోర్, మల్లేష్, బాలయ్య, రాములు, ఆంజనేయులు యాదగిరి, రాజు, నరేందర్ రెడ్డి, శివకుమార్ మరియు క్రీడాకారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ,వ్యవసాయేతర భూములను గుర్తించాలి

#### తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలు

**కీసర, జనవరి 16,ప్రభాతవార్తః** వ్యవసాయ, వ్యవసాయేతర భూములను క్షేత్రస్థాయిలో గుర్తించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కీసర తహశీల్దార్ కార్యాలయంలో గ్రామాలలో సర్వే నంబర్ల వారీగా వ్యవసా య, వ్యవసాయేతర భూములను గుర్తించే క్షేత్రస్థాయి పర్యట నల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి వ్యవ సాయానికి యోగ్యమైన భూమియేనా కాదా అనేది ఖచ్చితంగా గుర్తించి వివరాలను జాగ్రత్తగా డాటా ఎంట్రీ చేయాలని తహ శీల్దార్ అశోక్‌కుమార్‌ని ఆదేశించారు. గ్రామాల వారిగా నిర్వ హించే తనిఖీల నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదికను తయారు చేసి డాటా ఎంట్రీకి ఇవ్వాలన్నారు. అవసరమైన చోట సర్వేయర్ల ద్వారా సమాచారం సేకరించి లే అవుట్లు నాలాగా మార్చిన భూములను ఇండస్ట్రీ లకు సంబం ధించిన వివరాలను జాగ్రత్తగా సేకరించాలని సిబ్బందికి సూ చించారు. అనంతరం కలెక్టర్ మ్యాపు ద్వారా చీర్యాల, గోదు మకుంట గ్రామాల సర్వే నంబర్ల ద్వారా కలెక్టర్ పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలను వివరించారు. లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్ఐలు పాల్గొన్నారు.

### ప్రమాణ స్వీకారానికి రావాలి

**షాద్‌నగర్, జనవరి 16, ప్రభాతవార్త :** ఈ నెల 20న నిర్వహించే రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ గ్రేడ్-1 గ్రంథాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి రావాలని తెలంగాణ ఉద్యమనేత, ఎమ్మె ల్సీ కోదం డరాంను ఆహ్వానించారు. గురువారం గ్రంథాలయ కమిటీ నూతన పాలకవర్గం సభ్యులు మదన్‌మోహన్‌రెడ్డి, టిజి శ్రీనివాస్, నక్క బాల్‌రాజ్ యాదవ్, క్యూసెట్ శ్రీను, జూపల్లి చంద్రశేఖర్, కత్తి చంద్ర శేఖర్, కృష్ణారెడ్డిలు ఎమ్మెల్సీ కోదండరాం ఇంటికి వెళ్లి ఆయనను కలుసుకొని ఆహ్వాన పత్రిక అందజేశారు.

### హరగోపాల్‌కు ఎమ్మెల్యే పాదాభివందనం

**షాద్‌నగర్, జనవరి 16, ప్రభాతవార్త, :** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామ నివా సి ప్రొఫెసర్ హరగోపాల్ గురువారం షాద్‌నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాం పు కార్యాలయానికి వచ్చిన ప్రొఫెసర్ హరగోపాల్‌ను ఎమ్మెల్యే శంకర్ కలవగానే పాదాభివందనం చేసి తన మనసులో ఆయన పట్ల ఉన్న అపారగౌరవాన్ని చాటుకున్నారు. సొంత నియోజకవర్గమైన ఇరువురు మేధా వులు ఒకరి అనుభవాలను మరొకరు పంచు కుంటూ కాసేపు మాట్లాడుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రొఫెసర్ హరగోపాల్ సూచనలు, సలహాలు ఇచ్చారు.

### మాల్‌లో అంబేద్కర్ జగ్జీవన్‌రావ్ విగ్రహాల ఏర్పాటుకు సన్నాహకం

**యాచారం, జనవరి 16, ప్రభాతవార్త :** యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీ పరిధిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,బాబు జగ్ జీవన్ రావ్ ల విగ్రహాల ఏర్పాటుకై విగ్రహాల దాత యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్ ఒక లక్ష 30 వేల రూపాయలు అందజేశారు. విగ్రహాలను నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ గ్రామం నుండి గురువారం మాల్ గ్రామానికి ప్రతిష్టించడానికి సన్నాలు చేశారు. కార్యక్రమంలో యాచారం మండలం మాజీ జెడ్పిటిసి సభ్యులు చిన్నోల్ల జంగమ్మ యాదయ్య,మాల్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ చిన్నోళ్ల పద్మజ జహంగీర్, యాచారం మండలం నాయకులు చిన్నోళ్ల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి భాస్కర్ గౌడ్, గుడు గుంట్ల కృష్ణ, విగ్రహాల కమిటీ అధ్యక్షులు మంద లింగం,మాజీ వార్డు సభ్యులు గడు గుంట్ల యాదయ్య, చిన్నోళ్ల వెంకటయ్య, చిన్నోళ్ల యాదయ్య, గుడు గుంట్ల రాములు,గడ్డ మీది మదార్, చిన్నోళ్ల గోపాల్, గడ్డమీది యాదయ్య, చిన్నోళ్ల మల్లయ్య, జంగిలి యాదయ్య, మస్కు ముత్యాలు, బోడ ముత్యాలు తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఘనంగా జైపాల్‌రెడ్డి జయంతి

**తలకొండపల్లి జనవరి 16: ప్రభాతవార్త :** మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి 83వ జయంతిని గురువారం నాడు తలకొండపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సూదిని జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైపాల్ రెడ్డి సేవలు తెలంగాణ రాష్ట్రంలో మరువలేని వని రాష్ట్రం ఏర్పాటుకు సంబంధించిన సూచనలను సలహాలు అందించిన మేధావని వారు కొనియాడారు . జైపాల్ రెడ్డి నాయకత్వంలో దేశంలో అనేక అభివృద్ధి పథకాలకు పునాది వేశారని ఈ సందర్భంగా వారు చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు భగవాన్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు రాములు, దాసరి యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్ నాయకులు కృష్ణ, రవీందర్ నరసింహ, బోళ్ల యాదగిరి, వెంకటయ్య సురేష్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

### మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**కొల్చారం, జనవరి, 16 ప్రభాతవార్త:** యువకులు క్రీడలపట్ల మక్కువ పెంచుకొని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నాయకులు సోమన్నగారి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం కొల్చారం మండలం రంగంపేటలో రంగంపేట ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీలు ఘనంగా ముగిసాయి. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఆర్‌పీఎల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుండి కొనసాగాయి. ప్రీమియర్ లీగ్ సీజన్-4లో జూనియర్స్ ఎనిమిది జట్లు, సీనియర్ టీమ్ నాలుగు జట్లుగా ఏర్పడి ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు అందజేయడానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు సోమన్నగారి రవీందర్‌రెడ్డి హాజరై ట్రోఫీలను అందజేశారు. ఫైనల్‌లో బండి రాజు, ఉసికె రాజు టీమ్‌లు తలపడగా బండి రాజు టీమ్ విజేతగా నిలిచింది. సీనియర్స్ టీమ్ విజేతగా వడ్ల నాగరాజు టీమ్ గెలుపొందింది. విజేతలకు కీర్తిశేషులు మద్దెల దశరథం జ్ఞాపకార్థం వారి కుమారులు నవీన్, ప్రవీణ్‌లు ట్రోఫీలను అందజేయగా, విన్నర్ టీమ్‌కు రూ.20 వేలు, రన్నర్ టీమ్‌కు రూ. 10 వేల నగదు బహుమతిని నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఆర్‌పీఎల్ మేనేజ్‌మెంట్‌కు 10 వేల రూపాయల నగదును అందజేశారు. అంతకుముందు ఇరుజట్లకు డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బండి సుజాత రమేష్, మాజీ ఎంపీటీసీ మాధవి రాజాగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, యూత్ అధ్యక్షులు అల్లీ చందు, గ్రామ కమిటీ అధ్యక్షులు గోండ కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ గోపిగారి దుర్గేష్ గౌడ్, నాయకులు వంజరి మల్లేశం, మాందాపూర్ జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కంచర్ల నాగరాజు, కొమ్ముల రవీందర్ గౌడ్, శ్రీశైలం, బండి మల్లేశం, అంజాగౌడ్, జనార్ధన్, గోవర్ధన్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజయం సాధించిన జట్టుకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం



కళాశాలలో వంటల ప్రదర్శన దృశ్యం

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిండి వంటల ప్రదర్శన

**హుస్నాబాద్ టౌన్, జనవరి 16, ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సాంప్రదాయ వంటల ప్రదర్శన ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పిండి వంటలలో అనేక పోషక విలువలు ఉన్నాయని, విద్యార్థులు పిండి వంటలు చేయడంతో పాటు తినాలని వివరించారు. అనంతరం విద్యార్థులు ఇండ్లలో తయారు చేసిన సాంప్రదాయ పిండి వంటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, చంద్రమౌళి, బాలరాజు, దేవి, ఫాతిమా, రాజ్యలక్ష్మీ, రమేష్, శ్రీనివాస్, పర్శ రాములు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఏఎస్ఐ



వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరిస్తున్న ఏఎస్ఐ

**హుస్నాబాద్ రూరల్, జనవరి 16,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏఎస్ఐ సుధాకర్ అన్నారు. గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో వాహనదారులు, ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, నివారణ, ట్రాఫిక్ నింబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ దరించాలన్నారు. త్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని, మైనర్లకు వాహనాలు అసలే ఇవ్వవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లితండ్రులతోపాటు వాహనాల యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి వాహనదారుడు అనుమతి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ దగ్గర ఉంచుకోవాలన్నారు.

### ఆహార భద్రత కార్డుల సర్వే పరిశీలన

**కీసర,జనవరి 16,ప్రభాతవార్త :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 20 మున్సిపాలిటీలలో గురువారం నుండి ప్రారంభమైన ఆహార భద్రత కార్డుల ఇంటింటి సర్వేను 17వ వార్డులో మేడ్చల్ అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా పరిశీలించారు. రేషన్ కార్డుల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణీత గడువులో సర్వే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే మెరుగైన వైద్యం

#### ఎంపి ఈటల రాజేందర్

**కీసర, జనవరి 16, ప్రభాతవార్త :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రోగులు సద్వి నియోగం చేసుకోవాలని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం రాంపల్లిలో 15వ వార్షిక సంఘం నిధులు రూ.1 కోటి 43 లక్షలతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, నాగా రం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,కమిషనర్ భాస్క ర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు గూడూరు సవిత ఆంజనేయులుగౌడ్, అన్నంరాజు లావణ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### గొప్ప రాజనీతిజ్ఞుడు జైపాల్‌రెడ్డి

#### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 16:** అత్యున్నత రాజకీయ ప్రమాణాలు పాటించిన గొప్ప రాజనీతిజ్ఞుడు జైపాల్ రెడ్డి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేసిన మహానీయుడు జైపాల్‌రెడ్డి అని అన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, అగ్గనూరు బస్వం, ఇబ్రహీం, శ్రీనివాస్ యాదవ్, కొమ్ముకృష్ణ, జాంగారి రవి, గోవర్ధన్ గౌడ్, ఖదీర్, మాధవులు పాల్గొన్నారు.

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి

#### జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

**దౌల్తాబాద్,జనవరి 16,ప్రభాతవార్త:** అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. దౌల్తాబాద్ మండలం తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ట్రైనీ కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు భరోసా,కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ ఈనెల 16 నుండి ప్రారంభమవుతున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకు సంబంధించి మండలంలోని 33 గ్రామపంచాయితీలో గ్రామ సభలు నిర్వహించి అందు లోనే పూర్తి సమాచారం తీసుకోవాలన్నారు. తహశీల్దార్ గాయత్రి,అగ్రికల్చర్ ఏవో సంధ్య,డిటీ చాంద్‌పాషా,ఆర్ఐలు చంద్రశేఖర్,సునీల్ పాల్గొన్నారు.

### 26 నుంచి రైతు భరోసా,ఇందిరమ్మ ఇళ్లు

**హైదరాబాద్, జనవరి 16 ప్రభాతవార్త :** ఈ నెల 26 రిపబ్లిక్ దినోత్సవం నుండి రాష్ట్రంలో రైతులకు ఎకరాకు రూ. 6వేల రైతుభరోసా, అర్హులైన ఇళ్ల స్థలం ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమాలను ప్రభుత్వం అమలుపరుస్తుందని తెలంగాణ ప్రభు త్వ చీఫ్‌విఫ్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నా రు. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో రూ.100కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. బడంగ్‌పేట్ మున్సి పాలిటీ పరిధిలో రూ.45కోట్ల అభివృద్ధి పనులకు మున్సిపల్ మేయర్ పారిజాత నర్సింహ్మారెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జనవరి 26వ తేదీ నుండి సీఎం ఎను ముల రేవంత్‌రెడ్డి గత ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారెంటీలలో ఎకరాకు 6వేల రూపాయాలతో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు తదితర కార్యక్రమాలను అమలు చేయబోతున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఎక్కడలేని విధంగా సాగుతు న్నాయని వెల్లడించారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి 83వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** జిల్లాలో 9 మంది ఏఎస్ఐ అధికారులకు ఎస్ఐలుగా పదోన్నతి లభించిందని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి తెలిపారు. పదోన్నతి పొందిన వారు ఇటీవల ట్రైనింగ్ పూర్తి చేసుకొని జిల్లా ఎస్పీకి రిపోర్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఎస్ఐలను జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవ చేస్తూ జిల్లాకు, పోలీస్ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు.

## రైతుభరోసా కోసం సర్వే చేస్తున్న ఆర్‌డిఓ



భూములపై సర్వే నిర్వహిస్తున్న ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి

**సిర్గాపూర్, జనవరి 16, ప్రభాతవార్త:**
రైతుభరోసా పథకంలో భాగంగా వ్యవసాయానికి యోగ్యం కాని భూముల సర్వే పనులు ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి ఆధ్వర్యంలో తహసీల్దార్ శంకర్, వ్యవసాయ అధికారి హరికృష్ణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారి భాస్కర్, రెవిన్యూ అధికారి రాజుతో కలిసి సర్వే పనులు కొనసాగిస్తున్నారు. ఈనెల 20వ తారీఖు వరకు సర్వేచేసి స్వాధీనం చేసుకున్న భూముల్లో ఇళ్ల స్థలాలకు, పరిశ్రమలకు, రోడ్ల నిర్మాణానికి, వ్యవసాయానికి అనుకూలంగా లేని గుట్టలు, కొండలు, రాళ్లురప్పలు ఉన్న భూములు, మైనింగ్ భూములను భూ భారతి పోర్టల్ నుంచి వెరిఫికేషన్ చేసుకుని ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభల్లో చర్చించి రైతుభరోసా పథకం నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలగించడం జరుగుతుందని ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి పేర్కొన్నారు.

## వరసిద్ధివినాయక 225 జయంతి ఉత్సవం

**-హాజరుకానున్న మహర్షులు, ఎంపి, ఎమ్మెల్యే**

**న్యాల్‌కల్, జనవరి 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని హద్నూర్ గ్రామశివారులో 224 సంవత్సరాల క్రితం స్వయంభువుగా వెలిసిన వరసిద్ధివినాయకుడు ఈనెల 17న నిర్వహించే 225వ జయంతి ఉత్సవాలకు ముస్తాబయ్యాడు. దక్షిణముఖంగల స్వయంభూ వరసిద్ధివినాయకుడిని చందనలేపనంతో, గరికతో పూజలు నిర్వహించడం ఆలయ ప్రత్యేకత అని చెప్పవచ్చు. బ్రాహ్మణ పురోహితులు స్వర్గీయ గణపతిదీక్షితులు కుమారులు పునీత్‌దీక్షితుల ఆధ్వర్యంలో ఈనెల 17న ఆలయంలో స్వామివారి 225వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ఉదయం 8.30గంటలకు పంచసూక్త రుద్రాభిషేకం విశేష పూజ, ఉదయం 10గంటలకు గణేశగాయత్రి, గణపతి అధర్వణ శీర్ష హవనము, మధ్యాహ్నం 1.30గంటలకు పూర్ణాహుతి, 1.45గంటలకు స్వామివారికి మహాహారతి, స్వామివారికి నైవేద్య సమర్పణ, మధ్యాహ్నం 2గంటల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ(అన్నదానం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జయంతి ఉత్సవ నిర్వాహకులు పేర్కొన్నారు. వరసిద్ధివినాయక 225వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి, ఝరాసంగం మండల బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ (అప్పగారు), జహీరాబాద్ ఎంపి సురేశ్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలుస్తోంది.

## ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడివో రఫీఖ్ ఉన్నీసా

**పెద్దశంకరంపేట, జనవరి 16, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుండి నూతనంగా ప్రారంభించనున్న పథకాలపై ఎంపిడివో రఫీఖ్ ఉన్నీసా, గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల తదితర పథకాలపై గ్రామాలవారీగా ఈనెల 21 నుండి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించాలని, లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలని వారికి సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపివో విఠల్‌రెడ్డి, ఈజీఎస్ ఏపివో నవాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

## ఎస్ఎస్‌సి పరీక్షలకు ఫీజు చెల్లించుటకు గడువు తేదీల ప్రకటన

**-జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్**

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 16, ప్రభాతవార్త:**
మార్చి-2025లో జరుపబడు ఎస్ఎస్‌సి పరీక్షలకు రెగ్యులర్, ఫెయిల్ అయిన విద్యార్థులు తత్కాల్ స్కీమ్ ద్వారా ఫీజు చెల్లించుటకు గడువు తేదీలు ప్రకటించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సి పరీక్ష ఫీజు చెల్లించే విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రధానోపాధ్యాయులకు ఫీజు చెల్లించుటకు అఖరు తేదీ, రూ.1000 అపరాధ రుసుముతో విద్యార్థులు ప్రధానోపాధ్యాయులకు ఫీజు చెల్లించుటకు ఆఖరి తేదీ 22.01.2025 అని, ప్రధానోపాధ్యాయులు సైబర్ ట్రెజరీ ద్వారా ఫీజు జమచేయుటకు ఆఖరు తేదీ 23.01.2025 అని, ప్రధానోపాధ్యాయులు ఎన్ఆర్ఎస్ కార్యాలయంలో సమర్పించుటకు ఆఖరు తేదీ 24.01.2025 అని ప్రకటించడం జరిగిందన్నారు. ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు అప్‌లోడ్ చేయుటకు చివరితేది 23.01.2025 అని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ వివరించారు.

## విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

**నారాయణఖేడ్, జనవరి 16 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నారాయణఖేడ్ డివిజన్‌పరిధిలోని విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు ఈనెల 19వ తేదీన నారాయణఖేడ్ పట్టణంలోని మంగల్‌పేటలోగల విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షులు బి.నర్సింలు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం విశ్రాంత భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మ్యాక్స్‌విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించి కంటి అద్దాలు, మందుగోలీలు, కంటి ఆపరేషన్లు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో ఈహెచ్ఎస్, జెహెచ్ఎస్, సిజిఈహెచ్ఎస్ కార్డు, హెల్త్‌కార్డుగల వారు కూడా అర్హులని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వారు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## సత్యసాయి మందిరంలో ఉచిత కంటి వైద్యశిబిరం

**నారాయణఖేడ్, జనవరి 16, ప్రభాతవార్త:**
ఈనెల 23వ తేదిన నారాయణఖేడ్ పట్టణంలో శంకర కంటి ఆసుపత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శ్రీసత్యసాయి సేవాసమితి నిర్వాహకులు ఒక పత్రకటనలో తెలిపారు. ఈనెల 23వతేదీన గురువారం నారాయణఖేడ్‌లో గల శ్రీ సత్యసాయిమందిరం సువర్ణథియేటర్‌రోడ్ నారాయణఖేడ్ నందు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, సెల్‌నెం. వెంట తీసుకునిరాగలరని నిర్వాహకులు ప్రకటించారు.

# అభివృద్ధిలో ఆదర్శం నారాయణఖేడ్ మున్సిపాలిటీ

### -ట్రాఫిక్ సమస్యకు లింక్ రోడ్లతో పరిష్కారం
### -అందంగా మారుస్తామంటున్న చైర్మన్, వైస్‌చైర్మన్

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 16, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపాలిటీన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపనులు చేపట్టి అందరికి ఆదర్శంగా నిలిపేందుకు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్‌సేట్‌లు చేపడుతున్న కృషి అభినందనీయమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. నారాయణఖేడ్ పట్టణం కొత్త కొత్త కాలనీల ఏర్పాటు, రింగ్‌రోడ్లు, బైపాస్‌రోడ్లతో పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. ఇందుకు సంబంధించి పూర్తివివరాల్లోకి వెళితే, జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిల సహకారంతో మున్సిపల్ ప్రజలకు ప్రధాన అవసరాలైన సిసి రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, హైమాస్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించుకుని అభివృద్ధిపనులు శరవేగంగా కొనసాగేలా తమ చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్‌సేట్‌లు చర్యలు తీసుకుంటున్నారు. 20కోట్ల టియుఐఎఫ్‌ఎసి నిధులతో మున్సిపల్ పరిధిలోని 15వార్డులలో మురుగు కాల్వలు, సిసి రోడ్లను, హైమాస్ లైట్లను, ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి సరఫరాకు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగింపచేయించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా 3కోట్లరూపాయల సిఆర్ఎస్ నిధులతో లింక్‌రోడ్డు నిర్మాణంపనులు శరవేగంగా నాణ్యవంతంగా పూర్తయ్యేలా చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్ శక్తివంచనలేకుండా కృషిచేస్తున్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే వ్యవసాయభూముల ధరలు ఆకాశానికి అంటుతాయని రైతులు ఆనందపడుతున్నారు. పట్టణం నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఇటీవలే భూమిపూజ సైతం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌ల కృషి మూలంగా నారాయణఖేడ్ మున్సిపాలిటీ దినాదినాభివృద్ధి చెందుతోందని చెప్పడం అతిశయోక్తి కాదు. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే అప్పారావుషెట్కార్, శివరావుషెట్కార్‌ల అడుగుజాడల్లో నడుస్తూ ఎంపి సురేష్‌కుమార్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిల సహకారంతో మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా పార్టీలకు అతీతంగా మున్సిపల్‌లోని ఆయాకాలనీల్లో అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్‌లు అంటున్నారు.

## యోగ్యంకాని భూముల గుర్తింపులో అలక్ష్యం వద్దు



జోగిపేటలో వ్యవసాయ భూములను పరిశీలిస్తున్న దృశ్యం

**జోగిపేట, జనవరి 16, ప్రభాతవార్త:**
ప్రభుత్వం నూతనంగా అమలు చేయబోతున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులకు సంబంధించి క్షేత్రపరిశీలన గురువారం ప్రారంభించారు. ఇందుకోసం మొత్తం మండలంలో ఆరుబృందాలను ఏర్పాటుచేసి లబ్దిదారులకు అర్హులైనవారిని గుర్తిస్తున్నారు. కాగా గురువారం జోగిపేట, అందోలులో ఆర్డీవో పాండు, తహశీల్దారు విష్ణుసాగర్, డిప్యూటి తహశీల్దారు మధుకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ఏర్పాటుచేసిన అధికారులబృందాల ఆధ్వర్యంలో జరుగుతున్న పరిశీలన తీరును పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న పథకాలకు అసలైన లబ్దిదారులనే గుర్తించాలని, అలాగే వ్యవ సాయానికి పనికిరాని భూములను కూడా క్షుణ్ణంగా గుర్తించాలని అధికారుల బృందాలకు సూచించారు. మండలంలోని జోగిపేట, అందోలు, అక్సాన్‌పల్లి, దానంపల్లి, డాకూరు, నాదులాపూర్ గ్రామాలలో గురువారం రైతుభరోసాకు సంబంధించి అధికారులబృందం సాగుభూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం

**కొల్చారం, జనవరి 16, ప్రభాతవార్త:**
కొల్చారం మండలపరిధిలోని ఎనగండ్ల గ్రామానికిచెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్ల సతీష్ తండ్రి వడ్ల నారాయణ గత కొన్నిరోజుల క్రితం మరణించిన విషయం తెలుసుకొని గురువారం ఎనగండ్ల గ్రామానికి వెళ్లి సతీష్‌ను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్, మెదక్‌జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్, మండల కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్‌లు పరామర్శించారు. నారాయణ మృతిపట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేసి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షులు, ట్రెజరర్ మధుసూదన్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్‌పార్టీ నాయకులు రవితేజ, మన్నె కిష్టయ్య, భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచి లక్ష్మీనరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు మనం ఫౌండేషన్ అండ

**గజ్వేల్ టౌన్, జనవరి 16, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామంలో తల్లి మరణంతో అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులకు గురువారం మనం ఫౌండేషన్ అండగా నిలిచి రూ.10వేల ఆర్థికసహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గొడుగుస్వామి, ప్రధానకార్యదర్శి కనకయ్య, కోశాధికారి ఆంజనేయులు, సభ్యులు కొండల్‌రెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

**అనాథ చిన్నారులకు నిత్యావసర సరుకులు అందజేత...**

**గజ్వేల్ టౌన్, జనవరి 16, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన దర్శనం నాగమణి వారంరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా భర్త మానసికస్థితి బాగోలేదు. దీంతో వారి ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారడంతో విషయం తెలుసుకున్న ఆర్థిక చేయూత ఫౌండేషన్ (ఏసిఎఫ్) ప్రతినిధులు గురువారం గ్రామానికి వెళ్లి చిన్నారులకు రూ.10వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెండం వెంకటేష్, వెన్నెలస్వామి, బాబు, బిక్షపతి, సత్యనారాయణ, పోయిల రమేష్, నర్సింగరావు, దుబాసి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిర్గాపూర్‌లో కబడ్డీ టోర్నమెంట్

**సిర్గాపూర్, జనవరి 16, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌లో ఏర్పాటుచేసిన కబడ్డీ టోర్నమెంట్‌ను బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సంజీవరావు టాస్‌వేసి పోటీలను ప్రారంభించారు. సిర్గాపూర్ గ్రామస్థులతోపాటు పరిసరగ్రామాల క్రీడాకారులను సంజీవరావు పరిచయం చేసుకుని అందరికి ఆల్ ద బస్ట్ చెప్పారు. కబడ్డీ పోటీలను తిలకించేందుకు యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యువకులు కేరింతలు కొడుతుండగా క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో తలపడ్డారు.

## కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



తిప్పని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

**సిర్గాపూర్, జనవరి 16, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని బొక్కస్‌గావ్ గ్రామానికిచెందిన తిప్పని భూమవ్వ, తిప్పని శాంతమ్మలు ఇటీవల మృతిచెందినట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి గురూరం గ్రామంలోని తిప్పని నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే భరోసా కల్పించారు. మాజీ ఎమ్మెల్యేవెంట మాజీ జడ్పీటిసి సభ్యులు నరసింహారెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రాంసింగ్, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు డాక్టర్ అలీ, మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ రామన్న, నాయకులు వైజనాథ్‌రావుపాటిల్, ప్రహల్లాద్‌రావుపాటిల్, కృష్ణారెడ్డి, జ్ఞానుపాటిల్, కిష్టారెడ్డి, రాజుపాటిల్, ఏశప్ప, పోచయ్య, శంకర్, నవనాథ్‌రావుపాటిల్, లక్ష్మణ్, వీరయ్య, శ్రీను, సాగర్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీలో స్పెషల్ రీ అడ్మిషన్ అవకాశం

**జోగిపేట, జనవరి 16,ప్రభాతవార్త:**
అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 1987-2012 బ్యాచ్‌లకు సంబంధించి డిగ్రీ పూర్తి చేయలేకపోయినవారికి స్పెషల్ రీఅడ్మిషన్ అవకాశాన్ని కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రమేష్, కోఆర్డినేటర్ డాక్టర్ జి.పండరిలు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్‌కు సంబంధించి యూనివర్సిటీకివెళ్లి ఫీజు చెల్లించాలని ఆయన తెలిపారు. అలాగే ఓపెన్ డిగ్రీ రెగ్యులర్ బ్యాక్‌లాగ్‌లకు సంబంధించి ఈనెల 30వరకు విద్యార్థులు ఆన్లైన్లో చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా స్పెషల్ రీఅడ్మిషన్ అవకాశాన్ని డిగ్రీ పూర్తి చేయలేకపోయినవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

**-ఆర్డీవో రమాదేవి**




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

**చిన్నశంకరంపేట, జనవరి 16, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల కోసం, ఆహారభద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసాను అధికారులు సర్వేను సజావుగా నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. గురువారం మండలకేంద్రమైన చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 26 వరకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద మెదక్‌జిల్లా ఎంపిక చేసిందని ఆమె తెలిపారు. అనంతరం మండలకేంద్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములను పరిశిలించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్ తదితరులున్నారు.

# పాతపంటల ఆహారంతో ఆరోగ్యం పదిలం

### -శంశల్లాపూర్‌లో పాతపంటల జాతర



శంశల్లాపూర్‌లో కొనసాగుతున్న పాత పంటల జాతర దృశ్యం

**న్యాల్‌కల్, జనవరి 16, ప్రభాతవార్త:**
డెక్కన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల పర్యవేక్షణలో సంక్రాంతి పర్వదినాన మండలంలోని వడ్డిగ్రామంలో ప్రారంభమైన పాత పంటలజాతర గురువారం మండలంలోని శంశల్లాపూర్ గ్రామంలో నిర్వహించారు. పాతపంటల విత్తనాలతో అందంగా అలంకరించిన ఎడ్లబండ్లకు పూజలు నిర్వహించి డిడిఎస్ సంఘాల బాధ్యులు కోలాటాలు ఆడుతూ సంప్రదాయ పాటలను ఆలపిస్తూ గ్రామంలోని పురవీధులగుండా నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. ఈసందర్భంగా డిడిఎస్ బాధ్యులు ఎస్.నర్సింలు, చెక్కమ్మ, నర్సమ్మ, లక్ష్మమ్మలు రైతులనుద్దేశించి మాట్లాడుతూ డిడిఎస్ సంఘాలుగల గ్రామాల్లో మంచిపోషకాలతో కూడిన పాతపంటల భోజనాన్ని భుజిస్తున్నారని, పశువులను, ఎరువులను, విత్తనాలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతిరైతుపై ఉందని గుర్తుచేశారు. సర్కార్ ఎరువులను పంటసాగుకు వినియోగిస్తుండటంతో భూమితోపాటు మన ఆరోగ్యం పాడవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లోని రైతులు కనీసం 5రకాల పాతపంటలను పండించి ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. తమ సంఘాల సభ్యులవద్ద 20రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పంట ఎరువులు వేసుకుని పాతపంటలైన కొర్రలు, సజ్జలు, జొన్నలు పండించుకుని ఆ ఆహారంతో తింటే ఆరోగ్యం తమ అదుపులో ఉంటుందని, ఆసుపత్రులకు వెళ్లి మంచాలు ఎక్కాల్సిన అవసరం ఉండదన్నారు. డిఎస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దివ్య వెలుగురి మాట్లాడుతూ భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో శంశల్లాపూర్ రైతులు, డిడిఎస్ సిబ్బంది మంజుల, చిన్ననర్సమ్మ, జనరల్ నర్సమ్మ, అల్లోల్ నర్సమ్మ, విజయలక్ష్మి, చుక్కమ్మ, శ్రీలయ, ప్రహ్లాద్, బాలయ్య, వినయ్‌కుమార్, ఎస్.నర్సింలు, డిడిఎస్, కెవికె శాస్త్రవేత్త సాయిప్రియాంక పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం

**కొల్చారం, జనవరి 16, ప్రభాతవార్త:**
కొల్చారం మండలపరిధిలోని వరిగుంతం గ్రామానికిచెందిన కీర్తిశేషులు జోగిపేట శాఖాగౌడ్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్, మండల కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్‌లు గురువారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి మృతిపట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేసి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షులు, ట్రెజరర్ మధుసూదన్‌రెడ్డి, అర్చనపల్లి శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ తుడుం రామకృష్ణ, ఉపేందర్ గౌడ్, వడ్ల చంద్రం, శేఖర్, సత్యాగౌడ్, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

## సిసి కెమెరాలు ధ్వంసం చేసి బంగ్లాలో చోరీ

**జోగిపేట, జనవరి 16,ప్రభాతవార్త:** మండల పరిధిలోని అక్సాన్‌పల్లిలో తాళాలు వేసిన బంగ్లాలో సిసి కెమెరాలు ధ్వంసం చేసి, తాళాలు కోసేసి ఇంట్లోని నగదు, బంగారం, వెండిని దొంగిలించిన సంఘటన బుధవారంనాడు రాత్రి జరిగింది. అక్సాన్‌పల్లికి చెందిన బోయిన నర్సింలు కుటుంబం హైద్రాబాదులో నివాసం ఉంటారు. అయితే అక్సాన్‌పల్లిలోని వారికి స్వంత భవనం ఉంది. దీనికి సిసి కెమెరాలు కూడా ఉన్నాయి. కాగా బుధవారం రాత్రి ఆ కెమెరాలను ధ్వంసం చేసి ఇంటి తాళాలు కట్‌చేసి ఇంట్లోని రెండు బీరువాల్లో ఉన్న లక్షా ఒకవేయి రూపాయల నగదు, కిలో వెండి పూజా సామాగ్రి, రెండు తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఈ మేరకు బోయిని నర్సింగు గురువరాంనాడు జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## నేరాలపై అప్రమత్తత అవసరం

**చిన్నశంకరంపేట, జనవరి 16, ప్రభాతవార్త:**
సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ అన్నారు. మండల పరిధి శాలిపేటలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్‌పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, ఫేక్‌కాల్స్‌పట్ల జాగ్రత్త పాటించడం, ఫేస్బుక్, ట్విట్టర్, వాట్సాప్ అకౌంట్‌లకు వచ్చే అనుమానిత లింక్స్, మెసేజులపట్ల జాగ్రత్త వహించాలన్నారు. మహిళలు, విద్యార్థులపై జరుగుతున్న నేరాలపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డుప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి ఉండాలని, ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యంత్రాగి వాహనాలు నడుపరాదన్నారు. మాదకద్రవ్యాలు రవాణా చేసే వ్యక్తులకు సహకారం అందించకూడదన్నారు.

## ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**వెల్దుర్తి, జనవరి 16, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రభుత్వం జారీచేసిన నిబంధనలకు అనుగుణంగా లబ్దిదారుల ఎంపికకు గురువారంనుండి అధికారులు సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని బండపోచాన్‌పల్లి గ్రామంలో రైతుభరోసా లబ్దిదారుల కోసం స్థానిక తాహశీల్దార్ కృష్ణ, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్‌తో పాటు రెవెన్యూసిబ్బంది పాల్గొని సర్వే చేపట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రైతు భరోసా వర్తిస్తుందన్నారు. అలాగే మండలంలోని ఉప్పులింగాపూర్, ధర్మారం, మంగళపర్తి, హస్తాల్‌పూర్ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది కలిసి సర్వే నిర్వహించి సాగుకు ఉపయోగపడని భూములను గుర్తిస్తున్నారు. అలాగే మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో రేషన్‌కార్డు లేనివారిని గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపిడివో ఉమాదేవితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## సాగు భూములకే రైతుభరోసా



వ్యవసాయయోగ్యంకాని భూములను గుర్తిస్తున్న అధికారులు

**గజ్వేల్, జనవరి 16, ప్రభాతవార్త:**
గజ్వేల్‌మండలంలోని జాలిగామ, దాచారం, సింగాటం, శేరిపల్లి గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖల సిబ్బంది గురువారం వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తించడం జరిగింది. భూభారతి పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణంకు మాత్రమే రైతు భరోసా సహాయం ఎకరానికి రూ.12వేలు అందించడం జరుగుతుందని వారు తెలిపారు. వ్యవసాయయోగ్యంకాని ఇళ్లు లేదా కాలనీలుగా మారిన అన్నిరకాల భూములను గుర్తించి వాటికి రైతుభరోసా సహాయం అందించరని అన్నారు.

## బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ



బాధితుడు యాదగిరికి ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ చంద్రమోహన్

**జగదేవ్‌పూర్, జనవరి 16, ప్రభాతవార్త:**
జగదేవ్‌పూర్‌గ్రామానికిచెందిన యాదగిరి గతకొద్దిరోజులక్రితం ఐఫోన్‌ను మండలపరిధిలోని బస్వాపూర్ గ్రామంలో పోగొట్టుకోగా బాధితుడు జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో సిఈఐఆర్ ద్వారా బాధితుని వివరాలు నమోదుచేసి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పట్టుకొని గురువారం బాధితుడు యాదగిరికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.